


# బ్లాకీ

"బ్లాకీ...."

"బ్లాకీ.... బ్లాకీ..."

పూర్ణ ఇంటి గేటు ముందు నిలబడి, రోడ్ము మీదకు చూస్తూ గొంతెత్తి మరీ పిలుస్తోంది. పక్కనే ఉన్న మూడేళ్ల తేజ మట్టిలో ఆడుకుంటూ తల్లి 'బ్లాకీ' అనగానే తనుకూడా 'బ్లాకీ' అని పిలుస్తున్నాడు.

"బ్లాకీ.. బ్లా..."

ఓ నల్లకుక్క పరుగు పరుగున పూర్ణ దగ్గరకు వచ్చింది. తోక ఊపుతూ మూతి పైకెత్తి ఒగురుస్తూ నిలబడింది బ్లాకీ. పూర్ణ గిన్నెలోని కూర కలిపిన అన్నం నేలమీద వేసింది. బ్లాకీ ఆత్రుతగా అన్నం తింటూ మధ్యలో పూర్ణ వంకా, మట్టిలో ఆడుకుంటూ చప్పట్లు కొడుతున్న తేజ వంకా చూస్తోంది.

పూర్ణ ఖాళీ గిన్నె పట్టుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది. బ్లాకీ సుష్టుగా అన్నం తిని "అన్నదాతా సుఖీభవ" అనుకుంటూ అన్నదాత కోసం దిక్కులు చూసింది. అన్నదాత కనిపించలేదు. తేజ దగ్గర కూర్చుని భుక్తాయాసం తీర్చుకుంటోంది.

తేజ మట్టిలో ఆడడం మానేసి బ్లాకీ దగ్గర కొచ్చాడు. నిగనిగలాడుతున్న బ్లాకీ మిలమిల మెరుస్తున్న తేజను చూసింది. తేజ బ్లాకీ మూతిని పట్టుకున్నాడు. నోటి దగ్గరున్న

చేతిని చూడగానే సరదాగా ఓ కాటు వేద్దామా అనుకుంది బ్లాకీ. మళ్ళీ అంతలో 'ఛ.. ఛ మన పూర్ణమ్మ కొడుకు. అంటే మన ఫ్రెండ్. కరిస్తే ఏం బాగుంటుంది?" అనుకున్నట్టు ఆ ప్రయత్నం విరమించుకుంది.

ముందు కాళ్ళు రెండూ పైకెత్తి. ఓ క్షణం నిలబడి, దబ్బున కింద పడింది బ్లాకీ. తేజ నవ్వుతూ చప్పట్లు కొట్టాడు. దాంతో బ్లాకీకి కాస్త గర్వం కలిగింది. 'అరే, అబ్బాయ్! ఇలాంటి ఫీట్లు మనకెన్నివచ్చో తెలుసా' అన్నట్లు చూసి, ఇసకలో అటు ఇటూ దొర్లింది. తేజ మళ్ళీ నవ్వుతూ చప్పట్లు కొట్టాడు. మరో ఫీటు చేద్దామా అనుకుని, 'అన్నం తిన్న తరువాత మనకు అలా షైరు కెళ్ళొస్తే కానీ బావోదు. ఏం చేస్తాం' అనుకుంటూ బ్లాకీ అక్కడ నుంచి కదిలింది. తేజ కొంతదూరం దాని వెనకాలవెళ్ళి, మళ్ళీ మట్టిలో ఆడుకోవడం మొదలెట్టాడు. తేజ ఆగిపోవడం చూసి బ్లాకీ వెనక్కు నాలుగడుగులేసి, అతని ఆటలు చూస్తూ అక్కడే పడుకుంది. కాసేపట్లో మాగన్ను పట్టింది.

చీకట్లు ముసురుకోగానే వీధి దీపాలు వెలిగాయి. సముద్రపు గాలులు చల్లగా వీస్తుంటే బ్లాకీకి సడెన్‌గా తెలివొచ్చేసింది. తేజ కోసం చూసింది. కనిపించలేదు. వెంటనే ఇంటికేసి బయల్దేరింది.

ఇంటి గేటు తీసే వుంది. 'మన పూర్ణమ్మ గారిల్లే కదా. మనకడ్డేమిటి?' అనుకుని ఇంట్లోకెళ్ళింది. తేజ కనపడలేదు. మోరపైకెత్తి గాలిపీల్చి, తేజ లోపలి గదిలో ఉన్నట్టు గ్రహించింది. 'వాడే వస్తాడులే' అనుకుని, ముందు గదిలో ముడుచుకుని, కళ్ళు మూసుకుంది. కాసేపటికి తేజ బొమ్మ కారు లాగుకుంటూ వచ్చాడు. బ్లాకీని చూసి కారు వదిలేసి దాని దగ్గరకెళ్ళి తోకపట్టుకుని లాగాడు. బ్లాకీ ఉలిక్కిపడి, తల వెనక్కి తిప్పి చూసింది. తేజ నవ్వుతున్నాడు. 'తప్పుకదూ' అన్నట్లు ఓ మందలింపు చూపు చూసి 'సర్లే' అనుకుని తోకాడించింది. తరువాత తేజతో చెలగాటాలాడ్డం మొదలెట్టింది.

ఇంతలో బర్ర్‌మని స్కూటర్ శబ్దం.

సుబ్రహ్మణ్యం స్కూటర్ దిగి, స్టాండ్ వేసి, ముందు గదిలోకొచ్చి "ఛీ"! అన్నాడు. బ్లాకీ 'భౌ.. భౌ" మంటూ లేచింది. సుబ్రహ్మణ్యం ఓ అడుగు వెనక్కువేశాడు. పూర్ణ గబగబా వచ్చి, సుబ్రహ్మణ్యాన్ని చూసి, "ఆగిపోయారేం, నేను మీ కస్తమానం చెబుతూంటానే, ఆ బ్లాకీ ఇదే. ఏం చేయదు" అంది.

'నేనంటే ఏమనుకొన్నావ్' అన్నట్టు సుబ్రహ్మణ్యం వంక చూసి, బ్లాకీ పడుకోబోయింది.

సుబ్రహ్మణ్యం విసుగ్గా చూస్తూ మళ్ళీ 'ఛీ..ఛీ...' అన్నాడు. బ్లాకీ మళ్ళీ 'భౌ.. భౌ" మందామని నోరు తెరచి 'వీడితో మనకెందుకులే' అనుకుని ఆగిపోయింది. కదిలి పక్కకు తప్పుకుంది. సుబ్రహ్మణ్యం లోపలికి వచ్చి "పూర్ణా! నాకు కుక్కలంటే అసహ్యం అని

నీకు తెలుసుకదా! దాన్ని లోపలికెందుకు రానిచ్చావ్?" అన్నాడు చిరాగ్గా మొహం పెట్టి.

'ఇది అన్ని కుక్కల్లాంటిది కాదండీ. దీని దెంత మంచి గుణమో! ముందు గది దాటి లోపలకి రాదు. మనం పెట్టందే ఏదీ ముట్టదు. బ్లాకీని చిన్నప్పుడెవరో పెంచుకుని వదిలేశారట. అందుకేనేమో ఊరకుక్కయినా పెంపుడు కుక్కలా బుద్ధిగా వుంటుంది" అంది పూర్ణ.

"సుబ్రహ్మణ్యం, చిరాగ్గా తన వంకే చూస్తున్న బ్లాకీని చూసి బాత్‌రూంకెళ్ళిపోయాడు. 'అమ్మా, కాశీ అన్నపూర్ణేశ్వరీ, నీకీ కాటు మొహంగాడు దొరికాడేంటమ్మా? ఎలా నెగ్గుకొస్తావో ఏంటో' అనుకుంటూ బ్లాకీ మెల్లగా అక్కడ నుంచి జారుకుంది.

మర్నాడు నీలంలాగు, తెల్లచొక్కా టక్ చేసుకుని, టై కట్టుకుని గేటు దగ్గర మెరిసిపోతున్న తేజను దూరం నుంచి చూసి, పరుగెత్తుకుని వచ్చింది బ్లాకీ. తేజ చప్పట్లు కొట్టి బ్లాకీ తల నిమిరాడు. టైమ్ అయిపోతుందనుకుంటూ హడావుడిగా వీధిలోని స్కూటర్ దగ్గరకొస్తూ, సుబ్రహ్మణ్యం బ్లాకీతో ఆడుకుంటున్న తేజను చూశాడు. "తేజా! ఇలారా!" అన్నాడు కోపంగా.

"నాన్నా, బ్లాకీ" అన్నాడు తేజ.

"ఏడ్చావులే. దాన్ని ముట్టుకుని ఆడకూడదమ్మా, దానికేమన్నా తెగుళ్ళుంటే నీ కంటుకుంటాయి".

తండ్రి మాటలర్థంగాక, తేజ తెల్లమొహం వేశాడు.

కొడుకు మౌనం ఆసరా చేసుకుని, సుబ్రమ్మణ్యం "ఛీ.. ఛీ" అన్నాడు. బ్లాకీకి కోపం వచ్చి వెంటనే 'భౌభౌ' మంది. సుబ్రహ్మణ్యానికి ఇంకా కోపం వచ్చి ఓ రాయి తీసి విసిరాడు. బ్లాకీ గబుక్కున తప్పుకుంది. తప్పుకుని ఇప్పుడు సర్రున వెళ్ళి దేబ్యం మొగంగాడి పిక్క పట్టేద్దామా అనుకుంది. మళ్ళీ అంతలో 'పోనిద్దూ' వాడు మన తేజగాడి నాన్న. వాడికి బుద్ధిలేకపోతే మనకైనా వుండాలి కదా' అనుకున్నట్లు ఆగిపోయింది.

స్కూటర్ స్టార్ట్ చేసి, తన ముందు స్కూటర్ హేండిల్ దగ్గర తేజను నిలబెట్టి, స్పీడుగా వెళ్ళిపోయాడు సుబ్రహ్మణ్యం. దుమ్మురేగి, బ్లాకీ కళ్ళల్లో పడింది.

"ఏం గీరరా నాయనా" అనుకుని బ్లాకీ ఇంటి గేటు ముందు నిలబడి, స్కూటర్ వెళ్ళిన వైపే చూస్తున్న పూర్ణ వంక చూసింది. పూర్ణ బ్లాకీని పట్టించుకోలేదు. బ్లాకీకి బాధేసినా సరిపుచ్చుకుంది.

"అప్పలమ్మా, తేజ స్కూల్లో ఏడవకుండా ఉంటాడా? అప్పుడే వాడికి చదువెందుకండీ అంటే ఆయన వినలేదు. ఎల్.కే.జీ.లో చేర్చారు?" అంది పూర్ణ గిన్నెలు కడుగుతున్న పని మనిషితో.

"పర్లేదమ్మగారూ. రెండురోజులకదే అలవాటయిపోద్ది" అంది దిగులుగా వున్న అన్నపూర్ణను చూసి ఓదారుస్తున్నట్లుగా అప్పలమ్మ.

అంతలో వీధి కొసవరకు వెళ్ళి, తిరిగివచ్చిన బ్లాకీ 'వచ్చాను చూడు' అన్నట్టు పూర్ణను చూసింది. పూర్ణ ఉదాసీనంగా వుంది. ఆమె ముఖంలో ఏదో దిగులు.

'అయ్యో ఏడుపు మొహంగాడు తేజని ఏదో చేసే వుంటాడు. అందుకే పూర్ణమ్మ బెంగపడుతోంది' అనుకున్న బ్లాకీ ఆమెను ఊరడించడమెలాగో తెలియక, అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

మరో గంట తరువాత బ్లాకీ తిరిగి వచ్చింది. గేటు దగ్గర నిలబడింది. ఎంత సేపటికీ పూర్ణ బయటకు రాలేదు. బ్లాకీకి బోరు కొట్టింది. కాంపౌండు వాల్ పక్కనే ఉన్న ఇసక గుట్టను చూసింది. అది నిన్నటికంటే తరిగిపోయి ఉంది. బ్లాకీ గుండెల్లో రాయి పడింది.

"రోజురోజుకూ ఇసక తరిగిపోతోంది. పక్కింటోళ్ళు సిమెంట్ చేయించుకున్నారుగా. ఇంకో నాలుగు రోజులు పోతే, మనం ఈ పిట్టగోడ ఎక్కగలమా అనుకుని బ్లాకీ పిట్టగోడ పైకి ఎగిరి, అందక కింద పడింది. 'అబ్బా' అని మూలిగి, ఒకసారి అటూ, ఇటూ చూసి 'నయమే. మన్ని ఎవరూ చూడలేదు' అనుకుని దుమ్ము దులపరించుకుని, మళ్ళీ ఎగిరి పిట్టగోడ ఎక్కింది.

'తేజగాడు ఇపుడుంటే మన ప్రతాపం చూసి, ఎంత గట్టిగా చప్పట్లు కొట్టునో' అనుకుని, అలవాటు ప్రకారం పిట్టగోడపై నడిచి, గేటు దగ్గరున్న ఖాళీ ప్రదేశాన్ని దాటి, సన్‌షేడ్ పైకెగిరి ముడుచుకుని పడుకుంది. కడుపు కణకణలాడుతోంది. కాసేపు అలాగే వుండి, లేచి నిలబడింది. 'మరో ఇంటికెళ్దామా' అనుకుంది. 'పిలవని పేరంటానికెందుకు? ఎవరన్నా పిలిచాకే వెళ్దాం. అందాకా ఇక్కడే ఓ కునుకు తీద్దాం' అనుకుని కాళ్ళు ముడుచుకుని పడుకుంది. నిద్రలోకి జారుకుంటుండగా 'బ్లాకీ' అన్న పిలుపు వినిపించింది. ఒక్కసారి తుళ్ళిపడి చెవులు రిక్కించింది.

"బ్లాకీ.. బ్లాకీ..".

'హాయ్... మన్నే' అనుకుని సన్‌షేడ్ మీంచి పిట్టగోడ మీదకు దూకి, గబగబా నడిచి, గేటుమీది ఖాళీ ప్రదేశాన్ని దాటి, ఇసక గుట్టమీదకు దూకి, పూర్ణ చేతిలోని అన్నం గిన్నెనుచూసి, ఆనందంతో తోకాడిస్తూ మెరిసే కళ్ళతో పూర్ణకేసి చూసింది బ్లాకీ.

పూర్ణ గిన్నెలోని అన్నం పెట్టింది. అది తిని. 'కాశీ అన్నపూర్ణేశ్వరీ, సుఖీభవ' అనుకుని 'కాటు మొహంగాడు తేజను ఎప్పుడు తీసుకొస్తాడో' అనుకుంటూ గేటు దగ్గర కూచుని బ్లాకీ కళ్ళు మూసుకుంది. కొంత సేపటికి స్కూటర్ శబ్దం వినిపించింది. గబుక్కున లేచి నిలబడింది బ్లాకీ.

"బ్లాకీ... బ్లాకీ" అంటూ స్కూటర్ దిగి చప్పట్లు కొట్టాడు తేజ.

బ్లాకీ సంతోషంగా 'భౌ..భౌ' అనబోయి 'తేజ జడుసుకుంటాడు' అనుకుని 'వూవూవూ' అని రాగం తీసింది.

సుబ్రహ్మణ్యం బ్లాకీని విసుగ్గా చూసి “తేజా రా” అంటూ లోపలికెళ్ళిపోయాడు. బ్లాకీ కూడా వాళ్ళ వెనకాలే వెళ్లబోయి ఆగిపోయింది. ‘మన తేజగాడు స్కూటరెక్కాడు కదా. మనమూ ఎక్కి చూద్దాం’ అనుకుని స్కూటర్ మీద తేజ నిలబడిన చోట తనూ ఎక్కి నిలబడింది. కాళ్ళకు మెత్తగా రబ్బరు తగిలింది. ‘ఇక్కడ పడుకుంటే బలేహాయిగా ఉండేలాగుందే’ అనుకుని ముడుచుకుని పడుకుంది తేజకోసం ఎదురుచూస్తూ.

సుబ్రహ్మణ్యం ముఖం కడుక్కుని, తువ్వాలుతో తుడుచుకుంటూ బయటికొచ్చి స్కూటర్ మీదున్న బ్లాకీని చూసి కోపంగా “ఛీ ఛీ” అన్నాడు. బ్లాకీ ‘పోబే’ అనుకుంది కదలకుండా. సుబ్రహ్మణ్యానికి ఒళ్ళు మండిపోయింది. చిన్న కర్ర పట్టుకువచ్చి ఓ దెబ్బ వేశాడు. కుయ్యోమంటూ బ్లాకీ స్కూటర్ దిగి, సుబ్రహ్మణ్యాన్ని గుర్రుగా చూసింది. సుబ్రహ్మణ్యం కొట్టడానికి మళ్ళీ కర్రెత్తబోయాడు. బ్లాకీ దెబ్బకందకుండా కొంచెం దూరం పరుగెత్తుకువెళ్ళి ‘ఏదో మా తేజ నాన్న కదా అని ఊరుకుంటుంటే నన్నే కొడతావా. నీ డొక్కు స్కూటరెక్కాననే కదా! సరే, నీ స్కూటర్ మళ్ళీ ఎక్కి అక్కడ పెంట పెట్టేస్తాను. అప్పుడుగానీ నీ తిక్క కుదరదు’ అనుకుంటూ సుబ్రహ్మణ్యాన్ని మిర్రిమిర్రి చూసింది.

బ్లాకీ.... అంటూ తేజ వచ్చాడు.

“ఏయ్ తేజా! ఇలారా” అన్నాడు సుబ్రహ్మణ్యం.

‘వూవూవూవూవూ’ అని రాగం తీస్తూ బ్లాకీ ముందుకెళ్ళింది. తేజ దాని వెనక నడిచాడు. తేజ తన కూడా వస్తుండడం గ్రహించి “ఇప్పుడు చూడాలి అయ్యగారి మొహం” అనుకుని, వెనక్కి చూడబోయి నిగ్రహించుకుంది బ్లాకీ. మధ్యమధ్య తేజ వస్తున్నాడో లేదో చూస్తూ వీధి చివరిదాకా వెళ్ళింది. అక్కణ్ణుంచి కేరింతలు. తేజ తన వెంటే ఉన్నాడన్న ఆనందం. అలా వాళ్ళు చాలా దూరం వెళ్ళారు. కొంత సేపయ్యాక పక్కకు చూసింది. తేజ వెనకపడిపోయాడు. బ్లాకీ ఆగిపోయింది. తేజ దగ్గరకొచ్చాక బ్లాకీ ముందుకు కదిలింది. ఇద్దరూ కొండమీది కెళ్ళారు.

“పూర్ణా, బ్లాకీతో తేజ అలా పెంటల మీద తిరగడం ఏం బాగోలేదు” అన్నాడు సుబ్రహ్మణ్యం.

“తేజకి బ్లాకీతో ఆడుకోడం సరదా. చిన్న పిల్లాడు. ఆడుకోనిద్దురూ! అవునూ, బ్లాకీ మెడకి కట్టడానికి బెల్టు తెమ్మని మీకెన్నిసార్లు చెప్పినా తేవడం లేదు. రేపయినా మరచిపోకుండా తీసుకురండి” అంది పూర్ణ.

“ఈ నల్లముండకి బెల్టొకటి తక్కువ” అనుకున్నాడు సుబ్రహ్మణ్యం ముఖం మాడ్చుకుంటూ.

❀ ❀ ❀

సాయంత్రం నాలుగున్నరయింది.

తేజ స్కూటర్ దిగి యుకెజి పుస్తకాల సంచీ గూట్లో పెట్టి, స్కూలు డ్రస్సు మార్చుకున్నాడు. పూర్ణ టిఫిన్ పెట్టింది. టిఫిన్ ప్లేటు పట్టుకుని ముందు గదిలోకొచ్చి 'బ్లాకీ బ్లాకీ' అని పిలిచాడు తేజ.

'వూవూవూవూవూ' అని రాగం తీస్తూ బ్లాకీ పరుగు పరుగున వచ్చింది.

తను తింటూ గది ముందున్న సిమెంట్ చప్టా మీద ఒకో ఉప్మా ముద్ద వేస్తున్నాడు తేజ. రెండు ముద్దలు తిని మూడో ముద్ద తినకుండా వదిలేసింది బ్లాకీ రోజూలాగే. అలా చేయకపోతే టిఫినంతా తనకే పెట్టేస్తాడని బ్లాకీకి భయం. తేజ టిఫిన్ తిని, చేయి కడుక్కుని బయటికొచ్చాడు. బ్లాకీ ఇందాక వదిలేసిన ఉప్మా ముద్ద తినేసి గేటు దాటి ముందుకెళ్ళింది. తేజ బ్లాకీని దాటి ముందుకు పరుగెత్తాడు. బ్లాకీ తేజని దాటి ముందుకు పరుగెత్తింది. అలా పరుగెడుతూ కొండమీద కెళ్ళారు.

❀ ❀ ❀

పూర్ణ పనిలో పడిపోయింది. పొద్దుటా సాయంత్రం ఆమెకు ఊపిరి సలపనంత పని. సుబ్రహ్మణ్యానికి రాత్రి పూట గెదరుంటేనే కానీ ముద్ద నోట్లోకెళ్ళదు. చేపల కూర వండడం కోసం మసాలా నూరుతోంది పూర్ణ. తేజకి గెదరు వాసనే గిట్టదు. వాడికోసం ఏదో కూరగాయ వండాల్సిందే. వంట గదిలో ఉక్క పోసేస్తోంది. పూర్ణ "ఉస్.. అబ్బ" అనుకుంటూ వంట పని ముగించి, బాత్‌రూమ్‌కెళ్ళింది. బకెట్‌లో నీళ్ళు తీసుకొని పెరట్లోకి నడిచింది. రంగురంగుల పూలతో మొక్కలు పచ్చపచ్చగా దాహంతో చూస్తున్నాయి. ఒక్కో మొక్కకీ బకెట్‌లోంచి మగ్గుతో నీళ్ళు తీసి పోసింది పూర్ణ. ముఖానికి పట్టిన చమట తుడుచుకుంది. "హమ్మయ్య ఇంక స్నానం చేయ్యొచ్చు" అనుకుని బాత్‌రూంలోకి వెళ్ళింది. స్నానం చేసి బట్టలేసుకుని, అద్దం ముందు కెళ్ళి తల దువ్వుకోవడానికి దువ్వెన చేత్తో పట్టుకుంది. ఇంతలో బ్లాకీ అరుపు వినిపించింది. ఆ అరుపు రోజూలా లేదు.

పూర్ణ గబగబా బయటకు నడిచింది. బ్లాకీ భీకరంగా అరుస్తోంది. పూర్ణని చూడగానే బ్లాకీ మరింత గట్టిగా అరవటం మొదలుపెట్టింది. పూర్ణ ఆశ్చర్యపడుతూ వీధిలోకి చూసింది. "తేజ ఏడీ" అనుకుంది మనసులో. బ్లాకీ అరవడం మాని 'వూవూవూవూ' అని రాగం తీస్తూ ముందుకు కదిలింది. "తేజా" అని పిలిచింది పూర్ణ. బ్లాకీ మళ్ళీ వెనక్కి వచ్చి 'వూవూవూ' అని పూర్ణ చీర కుచ్చెళ్ళు నోటితో పట్టుకుని లాగింది. అప్పుడు పూర్ణకు మొదటిసారిగా భయం వేసింది. బ్లాకీ ముందుకు కదిలింది. ఇంటికి తాళం వేసి పూర్ణ దాని వెంట నడిచింది. బ్లాకీ పరుగెడుతూ పూర్ణ వెనకపడితే, ఆగుతూ కొండవేపు కెళ్ళింది.

చిరు చీకట్లు ముసురుకుంటున్నాయి. బ్లాకీ చిన్నచిన్న తుప్పల్ని దాటుకుంటూ వెళ్ళి ఓ తుప్ప పక్కన నిలబడి గట్టిగా అరుస్తోంది. కడుపు కోతతో కన్నతల్లి భోరున ఏడ్చినట్లు. పూర్ణ గబగబా బ్లాకీ దగ్గరకెళ్ళింది. అక్కడ నిలువెత్తు గొయ్యి. అందులో

నుండి తేజ మూలుగు. పూర్ణ గుండె దడదడలాడింది. "తేజా" అని పిలిచింది. "ఊ" అన్నాడు తేజ నీరసంగా. పూర్ణకు ఏడుపు వచ్చేస్తోంది. ఏం చేయాలో పాలుపోలేదు. ఆ ప్రాంతంలో ఎవరూ లేరు పిలుద్దామన్నా.

పూర్ణ ధైర్యం తెచ్చుకుంది నెమ్మదిగా గోతిలోకి దిగింది. తేజను ఎత్తుకుంది. "తేజా, నా బంగారు కొండా" అని హృదయానికి హత్తుకుంది. తర్వాత తేజను రెండు చేతులతోనూ ఎత్తి బ్లాకీ నిలబడ్డ చోట పడుకోబెట్టి తను అతికష్టం మీద గోతిలోంచి పైకి ఎక్కింది. బ్లాకీ 'వూవూవూవూ' అని రాగం తీస్తూ తేజ కాలిని నాకుతోంది.

పూర్ణ తేజను ఎత్తుకుని, కొండమీంచి రోడ్డు మీదకు వచ్చింది. బ్లాకీ పూర్ణ వెంట నడిచింది. వీథిలైట్ల వెలుగులో తేజను చూసింది. చొక్కా అంతా రక్తం. చేతులూ, కాళ్ళూ కొట్టుకుపోయాయి. పూర్ణ వస్తున్న దుఃఖాన్ని ఆపుకుని, డాక్టర్ ఇంటికి నడిచింది.

డాక్టర్ తేజను పరీక్ష చేసి గాయాలకు మందు వేసి "ఫర్వాలేదమ్మా, పెద్ద దెబ్బలేమీ తగలలేదు" అన్నాడు పూర్ణ మనసు కుదుటపడింది. బయట నుంచి వినిపిస్తున్న రాగం విని "అమ్మా, బ్లాకీ" అన్నాడు తేజ నవ్వు మొహంతో.

"బండ పిల్లోడా. అప్పుడే దెబ్బలమాట మరిచిపోయావన్న మాట" అని తేజను ముద్దుపెట్టుకొని డాక్టర్ ఇంటి నుంచి వీధిలో కొచ్చింది పూర్ణ.

'వూవూవూవూ' అని రాగం తీస్తూ బ్లాకీ మోరఎత్తి వాసన చూసి పరుగుపరుగున వెళ్ళిపోయింది. బ్లాకీ పరుగు చూసి పూర్ణ ఆశ్చర్యపోయింది. 'బ్లాకీ ఎక్కడికెళ్ళింది' అని పూర్ణ ఆలోచిస్తూ నడిచింది.

సుబ్రహ్మణ్యం ఇంటికి వేసివున్న తాళం చూసి స్కూటర్ పక్కన నిలబడి ఉన్నాడు. పూర్ణ ఎక్కడికెళ్ళిందా అని అనుకుంటూ. బ్లాకీ సుబ్రహ్మణ్యం దగ్గరకెళ్ళి 'వూవూవూవూ' అని రాగం తీస్తూ, తోకాడిస్తూ నిలబడింది. సుబ్రహ్మణ్యం ముఖం చిట్లించి చూశాడు. బ్లాకీ మళ్ళీ రాగం తీసింది.

తేజను ఎత్తుకుని వస్తున్న పూర్ణని చూశాడు సుబ్రహ్మణ్యం.

"ఎక్కడి కెళ్ళావ్" అని తేజని చూసి "ఏం అయ్యింది? ఎక్కడ పడ్డాడు?" అని అడిగాడు సుబ్రహ్మణ్యం కంగారుగా పూర్ణను.

"అదంతా చెబుతానుగానీ బ్లాకీ నన్ను లాక్కెళ్ళకపోతే తేజ ఏమైపోవునో చెప్పలేను. తేజ గురించి మీకు చెప్పడానికే బ్లాకీ డాక్టర్ ఇంటి దగ్గర నుంచి మీ దగ్గరకు మాకంటే ముందు పరుగుపరుగున వచ్చేసింది" అంది పూర్ణ బ్లాకీని ప్రేమగా చూస్తూ.

బ్లాకీ 'వూవూవూవూ' అని రాగం తీసింది. సుబ్రహ్మణ్యం బ్లాకీ తల నిమిరి, 'రేపు దీనికి బెల్ట్ కొనాలి' అనుకున్నాడు.

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 26.3.1986*